సాక్షి తిరుపతి

శుక్రవారం । 22 । నవంబర్ । 2024



ఎర్రచందనం పరిరక్షణకు కృషి

ఎర్రచందనం పరిరక్షణకు అటవీశాఖ, టాస్క్ ఫోర్స్ సంయుక్తంగా కృషి చేయాలని పీసీసీఎఫ్ ఎస్ఎస్.శ్రీధర్ సూచించారు.

- 8లో



తాళ్లమ్మ ఆలయ చోరీ కేసు వేగవంతం

డక్కిలి మండలం, దగ్గవోలు గ్రామదేవత తాళమ్మ ఆలయ చోరీ కేసును పోలీసులు అన్ని కోణాల్లో విచారిస్తున్నారు.

- 8లో



ఈ భూమి నాది..కాదు నాది!

రేణిగుంట ఎయిర్‌పోర్టు సమీపంలోని ప్రభుత్వ భూమి రెండు వర్గాల వారు తమదంటే తమదని గొడవకు దిగారు.

- 8లో

న్యూస్‌రీల్

ఉమ్మడి చిత్తూరు జిల్లా రీజనల్ కో-ఆర్డినేటర్‌గా పెద్దిరెడ్డి



మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సాక్షి ప్రతినిధి, తిరుపతి: ఉమ్మడి కర్నూలు, వైఎస్సార్ జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్‌గా ఉన్న మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఉమ్మడి చిత్తూరు జిల్లా రీజనల్ కో-ఆర్డినేటర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ గురువారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీచేసింది. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పెద్దిరెడ్డికి రీజనల్ కో-ఆర్డినేటర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొంది.

పాఠశాల విద్య బలోపేతం



మాట్లాడుతున్న పాఠశాల విద్య జోన్-4 రీజనల్ జాయింట్ డైరెక్టర్ శ్యామ్యూల్

రామచంద్రాపురం: పాఠశాల విద్య బలోపేతం చేయడానికే ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పాఠశాల విద్య జోన్-4 రీజనల్ జాయింట్ డైరెక్టర్ శ్యామ్యూల్ స్పష్టం చేశారు. ఈ నెల 18 నుంచి మెడ్‌జీ ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో జరుగుతున్న స్కూల్ లీడర్‌షిప్ శిక్షణ తరగతులను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమర్థవంతమైన నాయకత్వం ఉన్నప్పుడే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమవుతాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ పెంచాలని సూచించారు. తిరుపతి, అన్నమయ్య, నెల్లూరు జిల్లాలకు చెందిన 200 మంది స్కూల్ హెడ్స్‌కు ఈ శిక్షణ అందిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీఈఓ కేవీఎన్.కుమార్, రాష్ట్ర పరిశీలకులు అమ్మినాయుడు, తిరుపతి జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శివశంకరయ్య, అసిస్టెంట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ మధు, చంద్రగిరి ఎంఈఓ భాస్కర్‌బాబు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పోలీస్ డ్యూటీ మీట్



పోటీలలో పాల్గొంటున్న పీటీసీ సిబ్బంది

చంద్రగిరి: కల్యాణీ డ్యాం సమీపంలోని పోలీసు ట్రైనింగ్ కళాశాల(పీటీసీ)లో వార్షిక పోలీస్ డ్యూటీ మీట్‌ను గురువారం నిర్వహించారు. ప్రిన్సిపల్ సుబ్రమణ్యం జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సిబ్బందికి వాలీబాల్, షటిల్, షార్ట్‌పుట్, జావెలిన్ త్రో ఆటల పోటీలను నిర్వహించారు.

పచ్చని పసిడి పంటలు.. కళకళలాడే వరి మడులు.. నోరూరించే చిరుధాన్యాల సాగుకు తూర్పు మండలాలు పెట్టింది పేరు. కానీ ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక వ్యవసాయానికి ప్రోత్సాహం లేకపోవడం, కూలీల కొరత.. పెట్టుబడులు పెరిగిపోవడం.. దిగుబడి తగ్గిపోవడంతో సాగు భారంగా మారిపోతోంది. విధిలేని పరిస్థితుల్లో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు అడుగులు వేస్తున్నారు. ఇందులో పలువురు యూకలిప్టస్(తైలం చెట్లు) సాగుపై మొగ్గుచూపుతున్నారు. సత్యవేడు నియోజకవర్గంలో 12 వేల హెక్టార్ల సాగు భూములుండగా ఇప్పటికే 2,500 ఎకరాల్లో యూకలిప్టస్ చెట్లు సాగుచేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

భారంగా సాగు!



వరదయ్యపాలెం మండలం, ఎంజీనగర్ వద్ద నాటిన యూకలిప్టస్ మొక్కలు

కూటమి ప్రభుత్వంలో వ్యవసాయానికి ప్రోత్సాహం కరువు

- వేధిస్తున్న కూలీల కొరత
- భారీగా పెరిగిన పెట్టుబడి వ్యయం
- పెట్టుబడి సాయానికి పంగనామాలు
- ప్రత్యామ్నాయ పంటల వైపు రైతుల చూపు
- అంతకంతకూ తగ్గుతున్న దిగుబడి
- ఆందోళనలో అన్నదాతలు



సత్యవేడు మండలం, వెంకటాపురం వద్ద సాగులో యూకలిప్టస్ తోట

వరదయ్యపాళెం: ఏ అదునుకు ఏ పంట సాగు చేయాలి.. ఏ వరి వంగడాలైతే అధిక దిగుబడినిస్తాయి.. ఏ రకం వేరుశనగ విత్తనాలైతే అధిక ఆదాయం వస్తుందని నిత్యం రైతులు తలమునకలయ్యేవారు. అదునుకు ముందే సాగు చేస్తే అధిక దిగుబడి పొందవచ్చని భావించేవారు. కానీ రాను రాను వ్యవసాయం భారంగా మారడంతో విసిగిపోతున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయి తేరుకోలేకపోతున్నారు. దీనికితోడు ప్రభుత్వం నుంచి తగిన ప్రోత్సాహం లేక కుమిలిపోతున్నారు. విధిలేని పరిస్థితుల్లో వరి, వేరుశనగ, ఇతర చిరుధాన్యాల పంటల సాగుకు ఫుల్‌స్టాప్ పెట్టి పెట్టుబడి వ్యయం తక్కువగా ఉండే పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇందులో భాగంగానే జిల్లాలోని తూర్పు మండలాల రైతులు యూకలిప్టస్ చెట్ల పెంపకం వైపు అడుగులేస్తున్నారు. సత్యవేడు నియోజకవర్గంలోని వరదయ్యపాళెం, బీఎన్‌కండ్రిగ, నాగలాపురం, సత్యవేడు మండలాల్లో దశల వారీగా యూకలిప్టస్ చెట్ల పెంపకానికి చొరవ చూపుతున్నారు.

వేధిస్తున్న కూలీల కొరత

సత్యవేడు, వరదయ్యపాళెం మండలాల్లో వ్యవసాయ పనులకు కూలీల కొరత ప్రధాన సమస్యగా మారింది. కారణం రెండు మండలాల పరిధిలో అటు శ్రీసిటీ, ఇటు ఏపీఐఐసీ పరిధిలో మరికొన్ని పరిశ్రమలు ఏర్పాటు కావడంతో చదువుకున్న వారికి, చదువు లేని వారికి స్కిల్డ్, అన్‌స్కిల్డ్ ఉద్యోగాలు విరివిగా లభిస్తున్నాయి. ఏడాదికి నాలుగు నెలలు మాత్రమే పనులు కల్పించే వ్యవసాయ రంగానికి గ్రామస్థాయి నుంచి స్వస్తి పలుకుతున్నారు. దీంతో ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చే కూలీలతో పనులు చేయించుకోలేక చతికిలపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల నడుమ రానున్న అతికొద్ది సంవత్సరాలకే ఈ ప్రాంతంలో వ్యవసాయ సాగు ప్రశ్నార్థకంగా మారనుంది.

డిమాండ్ ఎక్కువ

మార్కెట్లో ప్రస్తుతం యూకలిప్టస్ కలపకు మంచి డిమాండ్ ఉంది. సత్యవేడు నియోజకవర్గంలో సాగవుతున్న యూకలిప్టస్ కలపను అదే నియోజకవర్గంలోని బీఎన్‌కండ్రిగ సమీపంలో ఉన్న కొన్ని పరిశ్రమలు కొనుగోలు చేస్తున్నారు. అలాగే తమిళనాడు సమీపంలోని ఆరంబాకం వద్ద కూడా ఈ కలపకు మంచి డిమాండ్ ఉంది. ప్రధానంగా యూకలిప్టస్ కలప నుంచి గుజ్జు తీసి పేపర్ తయారీ పరిశ్రమకు, ప్లైవుడ్ తయారీ పరిశ్రమకు వినియోగిస్తున్నట్లు సమాచారం. సంబంధిత పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు కూడా యూకలిప్టస్ చెట్ల పెంపకం గురించి గ్రామ స్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. తద్వారా సంబంధిత చెట్ల పెంపకం వైపు రైతులు అడుగులు వేస్తున్నారు.



వరదయ్యపాళెం మండలం, వెంగారెడ్డికండ్రిగ వద్ద ఏపుగా పెరిగిన యూకలిప్టస్ చెట్లు



బీఎన్‌కండ్రిగ మండలం, నెలవాయి వద్ద సాగులో యూకలిప్టస్ మొక్కలు

పెట్టుబడి ఎక్కువ.. దిగుబడి తక్కువ

జిల్లాలోని తూర్పు మండలాలైన బీఎన్‌కండ్రిగ, వరదయ్యపాళెం, సత్యవేడు, నాగలాపురం, పిచ్చాటూరు మండలాల్లో అత్యధికంగా వరి పంటను సాగు చేస్తారు. అయితే ఈ పంట సాగుకు పెట్టుబడి కింద ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు ఖర్చవుతుంది. వ్యయప్రయాసలకోర్చి పంటను సాగు చేసినప్పటికీ దిగుబడి అంతంత మాత్రమే. ఎకరాకు 25 నుంచి 30 బస్తాల వరకు దిగుబడి వస్తే... మంచి గిట్టుబాటు ధర ఉన్నప్పుడు మార్కెట్లో రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు వస్తుంది. పెట్టుబడులకు పోను మిగిలేది నామమాత్రమే. కౌలు రైతుల పరిస్థితి అయితే మరీ దారుణం. నాలుగు నెలల పాటు చేసిన కష్టానికి కూలి కూడా రాదని వాపోతున్నారు. ఈ పరిణామంతో కౌలు రైతులకు ఎకరాకు రూ.15 వేల వరకు నష్టం వాటిల్లుతుందని పలువురు ఆవేదన చెందుతున్నారు.

యూకలిప్టస్ సాగు ఇలా..

ప్రధానంగా యూకలిప్టస్ చెట్లను ఒక్కసారి సాగు చేస్తే 25 ఏళ్ల వరకు ఫలితాన్ని పొందవచ్చు. నాలుగేళ్లకు ఒకసారి సాగు చేసిన చెట్లు కట్టింగ్‌కి వస్తాయి. ఇలా సాగు చేసిన ప్రతి మొక్కనూ ఆరు సార్లు కట్టింగ్ చేసుకోవచ్చు. ఒక ఎకరాకు 2,200 మొక్కలు అవసరమవుతాయి. ఈ మొక్కలు నాటేందుకు గుంత తీసి మొక్క నాటడానికి ఒక్కో చెట్టుకు రూ.8 వరకు కూలీ కింద ఖర్చవుతుంది. దీంతో పొలం దున్నకం మొదలు మొక్క నాటడం వరకు ఒక్కో ఎకరానికి రూ.25 వేలు ఖర్చుపెడితే చాలు. ఇలా ఒకసారి పెట్టుబడితో 25 ఏళ్ల వరకు ఈ మొక్క పెరుగుదలకు కాలపరిమితి ఉంటుందని నర్సరీ నిర్వాహకులు చెబుతున్నారు. ఎకరం చెట్లు నాటితే ఖర్చులన్నీ పోను రూ. 2లక్షల వరకు ఆదాయం పొందవచ్చని రైతులు అంటున్నారు. ఎకరం చెట్లు సాగు చేస్తే 80 టన్నుల వరకు కలప వస్తుంది. తద్వారా టింబర్‌కు వెళ్లే కలప టన్ను రూ.9 వేలకు, సన్నటి కలప టన్ను రూ.6 వేల వరకు మార్కెట్లో రేటు పలుకుతోంది. దీంతో సరాసరిన ఏడాదికి ఒక ఎకరం చెట్ల పెంపకం ద్వారా రూ. 50 వేల వరకు రాబడి ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడి సాయానికి మొండిచేయి

అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వ్యవసాయాన్ని చిన్నచూపు చూస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏడాదికి రైతు భరోసా పథకం ద్వారా రూ.13,500 పెట్టుబడి సాయం కింద రైతులకు అందేది. ఎన్నికల హామీల్లో భాగంగా అదే పెట్టుబడి సాయాన్ని రూ.20 వేలకు పెంచుతామని ప్రచార సభల్లో నమ్మబలికింది. అయితే ఈ ఏడాది రబీ సీజన్ పూర్తవుతున్నా ఇంతవరకు పెట్టుబడి సాయం అందకపోవడంతో రైతులు మళ్లీ రుణదాతల వద్ద అప్పులు చేయాల్సిన పరిస్థితి దాపురించింది.

పది ఎకరాల్లో యూకలిప్టస్ సాగు చేస్తున్నా



నాకు 30 ఎకరాల వ్యవసాయ పొలం ఉంది. ప్రతి ఏడాదీ వరి, వేరుశనగ సాగు చేస్తా. అయితే ఈ రెండు పంటలతో ప్రతి ఏడాదీ నష్టం వాటిల్లుతోంది. కారణం కూలీల కొరత, అధిక పెట్టుబడులే. దీంతో ప్రత్యామ్నాయంగా ఒకేసారి పెట్టుబడి, కూలీలతో పనిలేని యూకలిప్టస్ చెట్ల పెంపకం వైపు మొగ్గు చూపాను. మొదటి విడతగా 10 ఎకరాలలో యూకలిప్టస్ చెట్లు సాగు చేస్తున్నాను. రానున్న ఏడాదికి మరో 10 ఎకరాల్లో చెట్లు నాటేందుకు సిద్ధం చేస్తున్నాను.

– మల్లికార్జున్‌రెడ్డి, రైతు, సిద్దాపురం

వ్యవసాయానికి ప్రోత్సాహం లేదు



ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో వ్యవసాయ రంగానికి ప్రోత్సాహం లేదు. ఎన్నికల సమయంలో పెట్టుబడి సాయం కింద ఇస్తామన్న రూ.20వేలు ఇప్పటివరకు ఇవ్వలేదు. గత ప్రభుత్వంలో విరివిగా దొరికే ఎరువులు, విత్తనాలకు డిమాండ్ ఏర్పడింది. ఇలాంటి పరిస్థితులలో వరి, వేరుశనగ పంటలను సాగు చేసి నష్టాల పాలవడం కన్నా ప్రత్యామ్నాయం వైపు ఆలోచన చేశా. ఆ దిశగా నాకున్న 8 ఎకరాలలో యూకలిప్టస్ చెట్లు సాగుచేస్తున్నా.

– మురళీ, కాపుకండ్రిగ, రైతు, సత్యవేడు మండలం

కౌలుకు సాగు చేయడం లేదు




వ్యవసాయ యోగ్యమైన భూములలో సాగు చేసేందుకు కౌలు రైతులు సైతం ముందుకు రావడం లేదు. కారణం పెరిగిన పెట్టుబడులు, కూలీల కొరతే. భూస్వాములందరూ తమ భూములను బీడు భూములుగా వదిలేశారు. నా కున్న 10 ఎకరాలల్లో మొదటి విడతగా మూడు నెలల క్రితం ఐదు ఎకరాలలో యూకలిప్టస్ చెట్లు సాగు చేశా. ప్రస్తుత పరిస్థితులలో చెట్ల పెంపకమే మాలాంటి రైతులకు శరణ్యం.

–మునస్వామి యాదవ్, రైతు, తొండంబట్టు

రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో..

వసూల్ రాజాలు!

- ఎన్‌జీ స్టాంప్‌లున్నా విక్రయించరు
- బయట స్టాంప్ వెండర్స్ వద్దే కొనాలి
- నకలు సర్టిఫికెట్ కావాలన్నా సమర్పించుకోవాలి
- భూమి, స్థలం విలువ సర్టిఫికెట్ కావాలన్నా అదే తీరు
- వసూళ్లకు కార్యాలయాల్లో ప్రైవేటు వర్కర్లు



సాక్షి టాస్క్‌ఫోర్స్: తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రయివేటు వ్యక్తుల దందా కొనసాగుతోంది. స్థలమో.. భూమో రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే ముందుగా వారిని సంప్రదించాలి. ఆపై వారు అడిగిన మొత్తాన్ని ముట్టజెప్పాలి. లేదంటే సంబంధిత అధికారులు చుక్కలు చూపిస్తారు. రేపు.. ఎల్లుండి అంటూ కాళ్లరిగేలా తిప్పుకోవడం షరామామూలైపోతోంది. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో మొత్తం 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. శ్రీకాళహస్తి, రేణిగుంట, తిరుపతి, తిరుపతి రూరల్, చిత్తూరు అర్బన్, పలమనేరు, కుప్పం, పుంగనూరు వంటి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రోజూ 30 నుంచి 60 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. మిగిలిన వాటిలో కనీసం అంటే 20కి తగ్గవు. ఇలా రెండు జిల్లాల్లో రోజూ సుమారు 3,500 నుంచి 4వేల రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి.

ప్రైవేటు వ్యక్తులతో వసూళ్ల పర్వం

రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చే వారి నుంచి కొందరు అధికారులు మామూళ్లు పుచ్చుకోందే పనిచేసి పెట్టరనే విషయం జగమెరిగిన సత్యం. నేరుగా లంచం తీసుకుంటే ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదని ఏసీబీ రైడ్స్‌కు భయపడి కొందరు అధికారులు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రైవేటు వ్యక్తులను నియమించుకున్నారు. అదేవిధంగా మరి కొందరు అటెండర్ల ద్వారా వసూలు చేసుకుంటున్నారు. ఏపనైనా వీరి ద్వారా జరిగేలా అధికారులు వ్యవహరిస్తుంటారు. ప్రతి రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్స్ కావాలంటే బ్రోకర్‌ని కలవాలి. అతను అడిగినంత ఇస్తే అన్ని వ్యవహారాలు చక్కబెట్టి పంపుతాడు. అలా రోజంతా వసూలైన మొత్తంలో అదే రోజు రాత్రి సంబంధిత అధికారులకు పంచిపెడుతారని కార్యాలయంలో పనిచేసే చిరుద్యోగి ఒకరు వివరించారు. గత కొంత కాలం వరకు ఓ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసే ఒక అటెండర్ అధికారులను బ్లాక్ మెయిల్ చేసి విచ్చలవిడిగా రిజిస్ట్రేషన్లు చేయించడం, వసూళ్లు చేయడం వంటి కార్యక్రమాలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ అటెండర్‌కి ఏ అధికారైనా భయపడాల్సిందేననే ప్రచారం ఉంది. శ్రీకాళహస్తి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అయితే ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు ప్రయివేటు వ్యక్తులు ఏది చెబితే అదే శాసనంగా తయారైంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరిగే ఈ వ్యవహారాలపై ఉన్నతాధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

సమర్పించుకుంటే వెంటనే సర్టిఫికెట్స్

రిజిస్ట్రేషన్లకే కాకుండా అనేక మంది భూ, ప్లాట్ల విలువ సర్టిఫికెట్ల కోసం కార్యాలయాలకు వస్తుంటారు. అదే విధంగా రిజిస్ట్రార్ కార్యాలయాల్లోని పుస్తకాల్లో ఉన్న నకలు సర్టిఫికెట్స్ కోసం వచ్చే వారు అనేక మంది ఉన్నారు. ఇవి ఇవ్వడానికి ఒక రోజులో పని. అయితే కార్యాలయాల్లో పనిచేసే కొందరు అధికారులు మామూళ్ల కోసం రేపు , ఎల్లుండి అంటూ తిప్పించుకోవడం సర్వసాధారణంగా మారింది. అదేమని అడిగితే సర్వర్లు పనిచేయలేదని తేలిగ్గా చెప్పేస్తారు. అదేవిధంగా వివాహ రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే వారు మామూళ్లు ఇవ్వకపోతే ఆ జంట రోజంతా కార్యాలయంలోనే పడిగాపులు కాయాల్సిందే.

స్టాంప్ పేపర్లు బ్లాక్‌లో కొనాల్సిందే

రోజూ రిజిస్ట్రేషన్ల కోసం వేల సంఖ్యలో స్టాంప్ పేపర్లు అవసరం. అటువంటి స్టాంప్ పేపర్లను ప్రభుత్వం సరఫరా చేస్తున్నా.. ప్రైవేటు వెండర్లు ఇచ్చే కమీషన్లకు కక్కుర్తిపడి కార్యాలయాల్లో విక్రయించడం మానేసినట్లు సమాచారం. అందుకు తిరుపతి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయమే నిదర్శనం. ఎన్‌జీ స్టాంప్ పేపర్లు ఉన్నా.. కార్యాలయంలో విక్రయించడం లేదు. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చేవారు చేసేది లేక ప్రైవేటు వెండర్స్ వద్ద అదనంగా చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తోంది. ప్రతి రిజిస్ట్రేషన్‌కి 4 నుంచి 7 పేపర్లు అవసరం. ఇవన్నీ ప్రైవేటు వెండర్స్ వద్ద రూ.50 నుంచి రూ.100 అదనంగా పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మత్స్యకారులకు ఏం చేశారో చెప్పండి?

- కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు గడుస్తోంది
- మత్స్యకార భరోసా లేదు.. రాయితీలు లేవు
- తిరుపతి చేపలను తమిళనాడు వారు దోచుకుపోతున్నారు
- ప్రపంచ మత్స్యకార దినోత్సవంలో సమస్యల ఏకరువు



ప్రపంచ మత్స్యకారుల దినోత్సవంలో కలెక్టర్‌తోపాటు మత్స్యశాఖ అధికారులు, మత్స్యకారులు

తిరుపతి అర్బన్: ఇప్పటి వరకు మత్స్యకారులకు కూట మి ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలంటూ పలువురు మత్స్యకారులు అధికారులను నిలదీశారు. కలెక్టరేట్‌లో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని మత్స్య శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సమక్షంలో నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న మత్స్యకారులు కార్యక్రమంలో భాగస్వాములయ్యా రు. అనంతరం వారు మాట్లాడుతూ గత జూన్‌లో 3,786 మంది మత్స్యకారులకు ఇవ్వాల్సిన భరోసా ఇప్పటి వరకు ఇవ్వకపోవడం న్యాయమా..?అని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీల బోట్లు, వలలు కొనుగోలుకు 90 శాతం రాయితీ, బీసీలకు 75 శాతం రాయితీ ఇస్తామని.. ఇంతవరకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమిళనాడు మత్స్యకారులు హైస్పీడ్ బోట్లతో తిరుపతి జిల్లా సముద్రతీర ప్రాంతంలోని చేపలను దోచుకుపోతున్నా కట్టడి చేసేవారు లేరన్నారు. జిల్లా మత్స్యకారుల వద్ద ఉన్న సన్న బోట్లకు చేపలు దొరకడం లేదన్నారు. జిల్లాలో 100 మత్స్యకారుల సొసైటీలు ఉన్నాయని, వాళ్లు మాత్రమే చేపలు పట్టుకోవాల్సి ఉందన్నారు. ప్రతి ఏటా ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో బాపట్ల నుంచి లక్ష చేప పిల్లలను తిరుపతికి దిగుమతి చేసి జాలర్ల సమక్షంలో వాటిని పెంచిన తర్వాత అక్టోబర్, నవంబర్ మాసాల్లో చెరువుల్లో వదిలిపెట్టేవారన్నారు. మేలు రకమైన చేప పిల్లలు కావడంతో మార్చి, ఏప్రిల్‌లో మంచి దిగుబడి వచ్చేదన్నారు. అయితే ఈ ఏడాది ఆ ఊసేలేద న్నారు. పులికాట్ ముఖద్వారాల్లోని పూడిక తీత పనులు ఇంతవరకు చేపట్టలేదన్నారు. దీనిపై కలెక్టర్ జోక్యం చేసుకుంటూ మత్స్యకారుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. 80 బోట్లు ఆధారంగా 4,203 మంది మత్స్యకారులు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జిల్లా అధికారి నాగరాజు, మత్స్యకార సంఘ జిల్లా అధ్యక్షులు జీవీ.రత్నం, పులికాట్ సరస్సు మత్స్యకారుల సంఘం నేత బొమ్మన శ్రీధర్, హేచరీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సాగర్‌రెడ్డి, మత్స్య, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

డ్రోన్ తయారీపై ఎంఓయూ



ఒప్పంద పత్రాలతో ఎస్వీయూ అధికారులు, డ్రోన్ సంస్థల ప్రతినిధులు

తిరుపతి సిటీ: డ్రోన్ వ్యవస్థపై శిక్షణ, తయారీ, పరిశోధనలపై ఎస్వీయూ పలు సంస్థలతో ఎంఓయూ కుదుర్చుకున్నట్లు వీసీ సీహెచ్ అప్పారావు పేర్కొన్నారు. వర్సిటీ వీసీ చాంబర్‌లో గురువారం ఆయన రిజిస్ట్రార్ భూపతినాయుడితో కలసి పలు సంస్థల ప్రతినిధులతో చర్చించి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. వీసీ మాట్లాడుతూ విద్యాపరమైన పరిశోధన, ఆవిష్కరణలు, శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, డ్రోన్‌ల తయారీ, మహిళల కోసం డ్రోన్ వంటి కార్యక్రమాల్లో బలమైన సహకారం కోసం డ్రోన్ వ్యవస్థలకు సంబంధించిన పలు సంస్థలతో వర్సిటీ ఒప్పందం కుదుర్చుకోవడం శుభపరిణామమన్నారు. ఇందు కోసం 'డ్రోన్స్, స్పేస్ టెక్నాలజీస్ కన్సార్టియం' ప్రతినిధులు అధికారికంగా సంతకం చేశారన్నారు. ఒప్పందపు పత్రాల్లో సంతకం చేసిన వారిలో ఆర్ఎఫ్ఎల్‌వై ఇన్నోవేషన్స్ సంస్థతో పాటు ఎర్త్‌నా ప్రైవేట్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ మిస్టర్ రితేష్ కుమార్ సింగ్, ఏరో హబ్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు బరహలికర్ నర్సింగ్ రావు, ఔరంటియస్ డైరెక్టర్ ప్రణవ్‌కుమార్ చిట్టి, టెక్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ శ్రీనివాస్‌ప్రసాద్, రుసా అధికారులు ఉన్నారు.

క్లుప్తంగా

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

– ఇద్దరు స్మగ్లర్ల అరెస్ట్



ఎర్రచందనం దుంగలు, స్మగ్లర్లతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

తిరుపతి మంగళం : అక్రమంగా తరలిస్తున్న ఎనిమిది ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ఇద్దరు స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పీ.శ్రీనివాస్ ఆదేశాల మేరకు డీఎస్పీ జీ.బాలిరెడ్డి పర్యవేక్షణలో కడప సబ్‌కంట్రోల్‌లోని ఆర్‌ఐ ఎం.చిరంజీవులకు చెందిన ఆర్‌ఎస్‌ఐ పీ.నరేష్ టీమ్, ఎఫ్‌బీఓ జీ.కిరణ్ కుమార్‌తో కలసి అన్నమయ్య జిల్లా, రాజంపేట పరిధిలోని ఎస్‌ఆర్‌పాళెం సెక్షన్‌లో కూంబింగ్ చేపట్టారు. రోళ్లమడుగు బీట్ వద్ద ఎరచ్రందనం దుంగలను మోసుకుని వస్తున్న స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు చుట్టుముట్టారు. వారిలో కొందరు పారిపోగా ఇద్దరు స్మగ్లర్లను పట్టుకున్నట్టు టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ బాలిరెడ్డి తెలిపారు. వారు తమిళనాడుకు చెందిన వారుగా గుర్తించినట్టు వెల్లడించారు. వారి నుంచి ఎనిమిది ఎర్రచ్రందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. స్మగ్లర్లను తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తరలించగా, సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

గంజాయి స్వాధీనం



నిందితుడితో పోలీసులు

నారాయణవనం: రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని రాజ్‌కుమార్(28) అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పుత్తూరు రూరల్ సీఐ రవీంద్ర తెలిపారు. గురువారం ఎస్ఐ రాజశేఖర్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. గురువారం పాలమంగళం వద్ద అరుణానది సమీపంలో సిబ్బందితో కలిసి గాలింపు చేపట్టామన్నారు. నది ఒడ్డున తచ్చాడుతున్న రాజశేఖర్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితుడు మండలంలోని మిట్టనైనారుకండ్రిగకు చెందిన జడబిళ్ల రాజకుమార్‌గా గుర్తించామన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఈ భూమి నాది.. కాదు నాది!



ఎయిర్‌పోర్ట్ సమీపంలో ప్రభుత్వ భూమిని చదును చేస్తున్న యంత్రాలు

రేణిగుంట విమానాశ్రయం, జాతీయ రహదారి ఆనుకుని రూ.కోట్ల విలువచేసే ప్రభుత్వ భూమిని కొట్టేసేందుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు ఈ భూమికి సంబంధించి కోర్టులో తమకు అనుకూలమైన తీర్పు వచ్చిందని ఓ వర్గం గురువారం భూమిని చదును చేయగా, మరోవర్గం ఆ భూమి తమదంటూ పనులను అడ్డుకుంది. దీంతో తహసీల్దార్ రంగప్రవేశం చేసి పనులను అడ్డుకుని తాత్కాలికంగా ఆపేశారు. అయితే వెబ్ ల్యాండ్‌లో ఈ భూమి ప్రభుత్వ భూమిగా స్పష్టంగా ఉన్నా అధికారులు కాపాడేందుకు మీనమేషాలు లెక్కిస్తుండడం గమనార్హం.

- రూ.కోట్ల విలువజేసే ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం
- రేణిగుంట విమానాశ్రయ సమీపంలో రెండు వర్గాల ఘర్షణ
- అడ్డుకున్న తహసీల్దార్
- టీడీపీ ముఖ్యనేత అనుమతితోనే కుట్ర!

రేణిగుంట: రేణిగుంట మండలం, కొత్తపాలెం రెవెన్యూ లెక్క దాఖల సర్వే నం.103–6సీలో 1.33 ఎకరాలు, 104–ఏలో 2.74 ఎకరాలు మొత్తం 4.07 ఎకరాల ప్రభుత్వ భూమి తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయానికి, పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారికి ఆనుకుని ఉంది. ఇక్కడ ఎకరా భూమి రూ.7 కోట్ల నుంచి రూ.10 కోట్లకు పైగా ధర పలుకుతోంది. అయితే ఈ భూమికి సంబంధించి తమకు పట్టా ఉందని ఓ వర్గం ఆ స్థలంలో బోర్డు పెట్టారు. కోర్టులో తీర్పు తమకు అనుకూలంగా వచ్చిందని గురువారం రెండు జేసీబీలు, ట్రాక్టర్లు పెట్టి చదును చేశారు. అయితే ఆ భూమి తమదంటూ, చెన్నైకి చెందిన మరో వర్గం ప్రతినిధులు అక్కడికి చేరుకుని పనులను అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. వీఆర్‌వో ఇచ్చిన సమాచారం మేరకు రేణిగుంట తహసీల్దార్ సురేష్‌బాబు ఘటనా స్థలానికి చేరుకున్నారు. భూమికి సంబంధించి ఇరు వర్గాల దగ్గర ఉన్న పత్రాలను తీసుకొని తహసీల్దార్ కార్యాలయానికి రావాల్సిందిగా ఆదేశిస్తూ తాత్కాలికంగా పనులను ఆపారు.

టీడీపీ ముఖ్యనేత అండదండలతోనే...

నియోజకవర్గంలోని టీడీపీ ముఖ్యనేత అండదండలతోనే రూ.30 కోట్ల నుంచి రూ.40 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని చేజిక్కించుకునేందుకు కుట్ర చేస్తున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. ఎకరానికి రూ.50 లక్షల చొప్పున తీసుకుని వారికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఓ వర్గం తమ వద్దనున్న డాక్యుమెంట్లతో ఆ భూమి తమదంటూ కోర్టులో కేసులు వేసి వ్యాజ్యాలు కూడా నడుస్తున్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో కూడా వీరు పలుమార్లు ఈ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించగా, అప్పట్లో రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు.

పనులు ఆపినట్టే ఆపి..

ఈ భూమిలో జరుగుతున్న పనులను తహసీల్దార్ సురేష్‌బాబు వచ్చి అడ్డుకుని తాత్కాలికంగా నిలిపివేశారు. తన అనుమతి లేనిదే మళ్లీ ఎవ్వరూ భూమిలోకి ప్రవేశించొద్దని హెచ్చరించారు. అయితే ఏమైందో ఏమోకానీ కాసేపటికే మళ్లీ ఓ వర్గం పనులను చేపట్టడం విశేషం.



ఆక్రమణదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్

> **విచారించి చర్యలు తీసుకుంటాం**
>
> రేణిగుంట విమానాశ్రయ మార్గం సర్వే నం .103,104 లో ఉన్న 4.07 ఎకరాలు భూమి ప్రభుత్వ భూమిగా ఉంది. ఈ భూమిలో ఇరువర్గాలు మాదంటే మాదని గొడవపడ్డారు. వారు చేపడుతున్న పనులను అడ్డుకున్నాం. ఈ భూమికి సంబంధించి తమ వద్ద రికార్డులున్నట్లు ఇరు వర్గాలు వారి వద్దనున్న డాక్యుమెంట్లు అందించారు. వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
>
> – సురేష్‌బాబు, తహసీల్దార్, రేణిగుంట

నీకు 15 వేలు, నీకు 18 వేలు..!

- పేదలకు ఆశజూపిన బాబు
- నోటికొచ్చిన అబద్ధాలతో అధికారం
- ఆరు నెలలైనా అమలు చేయని వైనం
- కూటమి ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే కిలివేటి ధ్వజం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి

తడ: ఎన్నికల ప్రచారంలో ఎవరు కనిపించినా.. నీకు రూ.15 వేలు.. నీకు రూ.18 వేలు అంటూ పగటి వేషగాని తరహాలో చంద్రబాబు నోటికొచ్చిన అబద్ధాలు చెప్పి ఓట్లు దండుకుని ఎన్నికలయ్యాక ఇచ్చిన మాటను మూటగట్టి అటక మీద పడేశాడని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఎద్దేవా చేశారు. జాతీయ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా తడలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు అందించే చిరు సాయాన్ని కూడా బాబు విస్మరించారని ధ్వజమెత్తారు. మత్స్యకార భరోసా పేరుతో రూ.10 వేలకు పెంచి అధికారంలోకి వచ్చిన వెంటనే అందించిన ఘనత జగనన్నదని చెప్పారు. ఆ రూ.10వేలను రూ.20 వేలకు పెంచుతామని మభ్యపెట్టి అధికారంలోకి వచ్చాక కూటమి నేతలు పైసా విదల్చలేదని మండిపడ్డారు. కేవలం మద్యం దుకాణాలు, బెల్టు షాపులు గడపగడపకూ అందుబాటులోకి తేవడం మినహా కూటమి ప్రభుత్వం పేదలకు చేసిందేమీ లేదన్నారు. ఎంపీ గురుమూర్తి చొరవతో పులికాట్ సరస్సులో ఇసుక మేట తొలగించేలా రూ.97 కోట్లు మంజూరయ్యాని గుర్తుచేశారు. వాతావరణం అనుకూలించి ఉంటే గత ఏడాది నవంబర్‌లో జగనన్న పూడికతీత కార్యక్రమానికి శంఖుస్థాపన చేయాల్సి ఉండేదని చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు కే.ఆర్ముగం, వైస్ ఎంపీపీ రమేష్, పెరియవట్టు సర్పంచ్ చిన్నప్పన్, నాయకులు రాజేంద్రన్, శివలింగం, సుందర్‌రెడ్డి, శశికుమార్, వరప్రసాద్, ప్రకాష్, మురుగన్, వాసు, తిరుమలై పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి



మృతి చెందిన డ్రైవర్‌ను వెలుపలకు తీస్తున్న హైవే పోలీసులు (ఇన్‌సెట్) లారీ డ్రైవర్ ముత్తుజాఖాన్

నాయుడుపేట టౌన్: రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతిచెందగా.. ముగ్గురు గాయపడిన ఘటన మండల పరిధిలోని పండ్లూరు గ్రామ సమీపంలో గురువారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. చైన్నై వైపు నుంచి నెల్లూరుకు వెళుతున్న లారీ గురువారం తెల్లవారు జామున 1.30 ప్రాంతంలో టైర్ పంక్చర్ అయ్యింది. దీంతో పంచర్ వేసేందుకు డ్రైవర్ లారీ టైర్ తీస్తున్నాడు. వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో లారీ రోడ్డుపై నిలిపి ఉన్న లారీని ఢీకొట్టింది. టైర్ విప్పుతున్న డ్రైవర్ పఠాన్ ముత్తుజా ఖాన్(58) లారీ టైర్ కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. హైవేపై విధులు నిర్వహిస్తున్న సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, హైవే మొబైల్ పోలీసులు స్థానిక ఏఎస్ఐ ధర్మయ్యతో కలిసి ఘటనా స్థలం వద్దకు చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన మార్కాపురం ప్రాంతానికి చెందిన లారీ క్లీనర్ జగన్, ఢీకొన్న లారీలో ఉన్న గూడూరుకు చెందిన డ్రైవర్ అహమ్మద్ రఫీ, కావాలి ప్రాంతానికి చెందిన క్లీనర్ వెంకటేశర్లును స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మార్చరీకి తరలించారు. రహదారిపై నిలిచిపోయిన లారీలను పక్కకు జరిపి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తన కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు ఎంపిక




ఎంపికైన విద్యార్థులకు సూచనలు ఇస్తున్న స్కూల్ ఫెడరేషన్ సంస్థ కార్యదర్శి బాబు

రామచంద్రాపురం: మండలంలోని నెత్తకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం తిరుపతి, చిత్తూరు జిల్లా అండర్–14 జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ క్రీడా పోటీలను ఎంఈఓ జయవేలు, తిరుపతి జిల్లా స్కూల్ ఫెడరేషన్ సంస్థ కార్యదర్శి బాబు, హెచ్‌ఎం తులసి కుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా స్కూల్ ఫెడరేషన్ సంస్థ కార్యదర్శి బాబు మాట్లాడుతూ జిల్లా స్థాయి అండర్–14 త్రోబాల్ పోటీలలో 12 మంది బాలురు, 12 బాలికలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్టు వెల్లడించారు. వీరిలో అండర్–14 బాలికల విభాగంలో భానుశ్రీ (సోమల, కందూరు), సుకన్య (నగరి), పద్మశ్రీ(సదుమూరు, కుప్పం), వర్షణ (పీసీఆర్, చిత్తూరు), వాణి (పంగూరు, ఏర్పేడు), చాందిని(పంగూరు, ఏర్పేడు), అనన్య (సోమల), దిశాలినీ (నెత్తకుప్పం), అక్షర(సోమల), వసంతిక (కందూరు), రాణి(పెద్ద కనపర్తి),గౌరీప్రియ (పూతలపట్టు), బాలుర విభాగంలో వసంత్‌కుమార్ (ఏకాంబరకుప్పం), గురులోకేష్ (పెద్ద కనపర్తి), మహమ్మద్ సయ్యద్ (చీనేపల్లి, ఉర్దూ స్కూల్), చరణ్‌తేజ్ (సోమల), రోహిత్ (మొగరాల), రేవంత్ (కందూరు), భువనేష్ (సదమూరు), తులసీరాం (పంగూరు), జహీర్ (రొంపిచెర్ల), కుశ్వంత్ (నెత్తకుప్పం), ప్రణీత్ (పీసీఆర్, చిత్తూరు), నితీష్ (పూతలపట్టు) ఉన్నట్లు తెలిపారు. వీరు త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో పీడీలు సుబ్రమణ్యం రెడ్డి, గోపీనాథ్, చిన్నప్ప, కరుణానిధి, లోకేష్, భవానీ, భార్గవి, దేవరాజులు, సురేష్ పాల్గొన్నారు.

తాళ్లమ్మ ఆలయ చోరీ కేసు వేగవంతం

- నిందితులను గుర్తించే పనిలో పోలీసులు



ఆలయంలో తలుపును కట్ చేసిన దొంగలు



ఆలయంలో దొంగలు ధ్వంసం చేసిన హుండీ, బీరువా, మైక్‌సెట్

దక్కిలి: మండలంలోని దగ్గవోలు గ్రామ దేవత తాళ్లమ్మ ఆలయంలో రెండు రోజుల క్రితం జరిగిన చోరీ కేసును ఛేదించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. వెంకటగిరి సీఐ వెంకటరమణ ఆధ్వర్యంలో పలు బృందాలు పనిచేస్తున్నాయి. మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి హుండీ పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లారు. అంతేగాక అమ్మవారి ఆభరణాలు కూడా దొంగిలించారు. ఈ వ్యవహారాన్ని గ్రామస్తులు గుర్తించి డక్కిలి పోలీసులకు బుధవారం రాత్రి ఫిర్యాదు చేశారు. వెంకటగిరి సీఐ వెంకటరమణ, బాలాయపల్లి ఎస్ఐ కామినేని గోపీ, వెంకటగిరి–2, ఎస్ఐ నాయక్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తిరుపతి నుంచి క్లూస్ టీమ్‌ను రప్పించి వేలిముద్రలను సేకరించారు. దొంగలు ఎక్కడి నుంచి వచ్చారు.. దేవస్థానం తాళాలు పగులగొట్టి వచ్చారా.. ఎంత మంది చోరీకి పాల్పడ్డారు అన్న కోణాలపై పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు. దేవస్థానం ఆవరణలో ఏర్పాటు చేసిన సీసీ టీవీ ఫుటేజీని సేకరించి పరిశీలించారు. ఇందులో చోరీకి పాల్పడ్డ వారు ఇద్దరు ఉన్నట్టు గుర్తించారు. అమ్మవారి నగలు, హుండీ కానుకలు, నగదు భారీ ఎత్తున చోరీ జరగడం చూస్తే బయట వ్యక్తుల పాత్ర ఉంటుందని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ముందుగానే రెక్కీ నిర్వహించి..

తాళ్లమ్మ ఆలయంలో చోరీకి పాల్పడ్డ ఘనటకు ముందు గత ఆదివారం ఇద్దరు వ్యక్తులు ఆలయంలోకి వచ్చి రెక్కీ నిర్వహించారు. ఆ తర్వాత అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి వారిని చూసి స్థానికులు, సమీప గ్రామాల భక్తులు కాదని గుర్తించి ప్రశ్నించడంతో తమది కడప జిల్లా, రాజంపేట అని వారు సమాధానం ఇచ్చినట్టు తెలుస్తోంది. ఆ మరసటి రోజే ఈ ఘటన జరగడం పలు అనుమానాలకు తావిస్తోంది.

దక్కిలి మండలంలో వరుస ఘటనలు

డక్కిలి మండలంలో గత ఆరు నెలలుగా వరుసగా దేవాలయాల్లో చోరీలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ఏడాది మేలో మండలంలోని కుప్పాయిపాళెం గ్రామదేవత నాంచారామ్మ తల్లి ఆలయంలో చోరీ జరిగింది. ఆలయంలో అమ్మవారికి సంబంధించి 9 కిలోల విలువ జేసే త్రిశూలం, హుండీలో ఉన్న రూ.20 వేల కానుకలు అపహరించుకెళ్లారు.గత సెప్టెంబర్‌లో డక్కిలిలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వస్వామి ఆలయంలో హుండీని పగులగొట్టి అందులో ఉన్న రూ.15 వేల నగదును చోరీ చేశారు. తాజాగా తాళ్లమ్మ తల్లి ఆలయంలో చోరీ సంఘటనతో భక్తులు ఆందోళన చెందుతున్నారు.

> **చోరీకి గురైన ఆభరణలు ఇవే**
>
> చోరీకి గురైన ఆభరణాలు వెండి కిరీటం–1 (1000 గ్రాములు), వెండి కళ్లు –2 (200గ్రా), డైమండ్ ముక్కు పుడక –1, బంగారు కాసులు –10 (20 గ్రా), బంగారు గుండ్లు 15 (15 గ్రా), బంగారు తాళిబొట్లు –1 (12 గ్రా), పంచలోహాల తాళిబొట్టు 1 (10 గ్రా), వెండితో తయారు చేసిన వడ్డాణం (1000 గ్రా)లతోపాటు హుండీలోని నగదు దొంగలించినట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి!

- ఈత కొడుతూ చనిపోయాడంటున్న స్నేహితులు
- లేదు కొట్టి చంపేశారంటున్న బంధువులు



మృతి చెందిన హేమాద్రి

రేణిగుంట: ఎస్వీ ఆర్ట్ కళాశాల విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఈత కొడుతూ ప్రమాద వశాత్తు మునిగిపోయాడని మృతుని స్నేహితులు చెబుతుండగా.. కాదు కొట్టి చంపేశారని అతని బంధువులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. తిరుమలకు చెందిన గంగరాజు కుమారుడు హేమాద్రి (20) తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ చదువుతున్నాడు. తోటి స్నేహితులు తొమ్మిది మందితో కలసి గురువారం మామండూరు అటవీ ప్రాంతంలోని వాగులో ఈతాడుతుండగా, హేమాద్రి లోతు ఉన్న ప్రాంతానికి వెళ్లడంతో మునిగిపోయాడు. అతని స్నేహితులు డయల్ 100కు కాల్ చేయడంతో పోలీసులు చేరుకుని హేమాద్రిని గట్టుపైకి తీసుకొచ్చి చికిత్స నిమిత్తం కరకంబాడి సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన డాక్టర్లు అప్పటికే విద్యార్థి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆపై మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు రేణిగుంట అర్బన్ ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

బిడ్డ శరీరంపై గాయాలున్నాయ్!

తిరుపతి సిటీ: చనిపోయిన విద్యార్థి హేమాద్రి వివరాలను సేకరించిన పోలీసులు ఎస్వీ ఆర్ట్స్ కళాశాల అధికారులకు, తల్లిదండ్రులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి మామండూరు యాత్రకు వెళ్లిన విద్యార్థులను అదుపులోనికి తీసుకుని విచారిస్తున్నారు. ప్రమాదమా... హత్యా అనే కోణంలో విచారిస్తున్నట్లు సమాచారం.

> **ప్రమాదం కాదు హత్యే**
>
> మా అబ్బాయిని స్నేహితులే చంపేశారు. మాది పులివెందుల. మా అబ్బాయి ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. స్నేహితులతో కలసి విహారయాత్రకు వెళ్లారు. ఈత రాక మునిగిపోయినట్లు స్నేహితులు చెబుతున్న మాటలలో వాస్తవం లేదు. మా అబ్బాయికి ఈత వచ్చు. మృతదేహంపై గాయాలు ఉన్నాయి. స్నేహితుల మధ్య గొడవలు తలెత్తి మా అబ్బాయిని కొట్టి చంపారనే అనుమానాలు ఉన్నాయి. –మునిరాజ, మృతుని బంధువు

> **నా బిడ్డను ఉన్నతాధికారిగా చూడాలనుకున్నా**
>
> అయ్యో... కొడుకా హేమాద్రి.. పెద్ద చదువులు చదివి ప్రభుత్వ అధికారిగా వస్తావని కలలు కన్నానే.. నేను బతికుండగానే నిన్ను ఇలా చూడడం తట్టుకోలేకపోతున్నాను. తల్లిలేని బిడ్డని ఎంతో ప్రేమగా చూసుకున్నాను. నిన్ను చదివించేందుకు రెక్కల కష్టం చేస్తున్నా. అయ్యా ఏమి జరిగింది దేవుడా... అంటూ మృతుని తండ్రి రుయా ఆస్పత్రి వద్ద గుండెలు పగిలేలా రోదించడం చూపరులను కంటతడి పెట్టించింది.


ఎర్రచందనం పరిరక్షణకు కృషి చేయాలి

తిరుపతి మంగళం : ఎర్రచందనం పరిరక్షణకు అటవీశాఖ, టాస్క్‌ఫోర్స్ సంయుక్తంగా కృషి చేయాలని రాష్ట్ర అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(పీసీసీఎఫ్) ఎస్ఎస్.శ్రీధర్ సూచించారు. తిరుపతి కపిలతీర్థం సమీపంలోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. శేషాచలంలోని అరుదైన ఎర్రచందనం అక్రమంగా తరలిపోకుండా పటిష్ట చర్యలు చేపట్టాల్సిన బాధ్యత అటవీశాఖ, టాస్క్‌ఫోర్స్ పోలీసులపై ఉందన్నారు. స్మగ్లర్లు అడవుల్లోకి చొరబడి చెట్లు నరకకమందే వారిని నిలువరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

రిజర్వాయర్ పనులు వేగవంతం

తిరుపతి అర్బన్: రిజర్వాయర్ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఇరిగేషన్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. తిరుపతి, తిరుమల ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని బాలాజీ, మల్లెమడుగు రిజర్వాయర్ పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ప్రాజెక్టు పనులకు సంబంధించి ఓ నివేదిక ఇవ్వాలని కోరారు. ఇరిగేషన్ అధికారులు మదనగోపాల్, రాధాకృష్ణమూర్తి, వెంకటేశ్వర్ ప్రసాద్ పాల్గొన్నారు.

మూడు నెలలు పింఛన్ తీసుకోకుంటే కట్



శోభనబాబు, డీఆర్‌డీఏ పీడీ

తిరుపతి అర్బన్: సామాజిక భద్రత పింఛన్‌దారులు వరుసగా మూడు నెలలు పింఛన్ సొమ్ము తీసుకోకుంటే అలాంటి వాటిని నిలుపుదల చేస్తారని డీఆర్‌డీఏ పీడీ శోభన బాబు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మొదటి నెల పింఛన్ తీసుకోకుంటే రెండో నెలలో ఇస్తారన్నారు. వరుసగా రెండు నెలలు పింఛన్ తీసుకోకుంటే మూడో నెలలో మూడు నెలలకు కలిపి ఇస్తారని చెప్పారు. అయితే వరుసగా మూడు నెలలు పింఛన్ తీసుకోకుంటే అలాంటి వాటిని నిలుపుదల చేస్తారని ఆయన స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగి మృతి



రాజ్‌కుమార్(ఫైల్)

శ్రీకాళహస్తి రూరల్: రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగి మృతిచెందిన ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. స్థానికుల సమాచారం మేరకు.. మండలంలోని కాపుగున్నేరి సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కే కే.రాజ్ కుమార్ (29) గురువారం విధులు ముగించుకుని సాయంత్రం 6.30 సమయంలో ఇంటికి వెళ్లేందుకు కాపుగున్నేరి హైవే రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో శ్రీకాళహస్తి వైపు వేగంగా వెళుతున్న కారు ఢీకొంది. దీంతో రాజ్ కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రికి తీసుకెళుతుండగా.. మార్గమధ్యంలోనే మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన కారుని రూరల్ పోలీస్ స్టేషన్ తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు.